సాక్షి
ఏలూరు
శనివారం, 12, ఆగస్టు, 2023



పులస వేటలో..
గోదావరిలో పులస వేట ముమ్మరంగా సాగుతోంది. సిద్ధాంతం నుంచి నరసాపురం వరకు నదిలో పులసలు పట్టడం కోసం మత్స్యకారులు శ్రమిస్తున్నారు. 10లో ▸



శవమై తేలిన చిన్నారి
మీనవిల్లూరులో రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయిన బాలుడు పోకల వెంకట కల్యాణ్ యనమదుర్రు డ్రెయిన్‌లో కోమర్రు వద్ద శవమై తేలాడు. 10లో ▸

త్వరలో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలు
బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు త్వరలో 4జీ సేవలు అందించనున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టెలికాం జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను తెలిపారు. 10లో

న్యూస్‌రీల్

18 నుంచి శ్రావణ మాసోత్సవాలు



నూకాలమ్మ ఆలయంలో కరపత్రికను విడుదల చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూకాలమ్మవారి ఆలయంలో ఈ నెల 18 నుంచి శ్రావణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, బంగారు సూర్యనారాయణ, కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఆలయంలో మాసోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతుఊ ఈనెల 18 నుంచి వచ్చే నెల 18 వరకు నెల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. తొలిరోజు అమ్మవారికి లక్ష పసుపు కొమ్ములతో అలంకరణ, 25న పూర్ణ కవచం అలంకరణ, సామూహిక వరలక్ష్మీవ్రతం, 27న స్వర్ణ పుష్పాలతో అర్చన, చిన్నారులతో సరస్వతి పూజ, వచ్చేనెల 1న లక్షగాజులతో అలంకరణ, 8న పండ్లతో అలంకరణ, 15న శాకాంబరి అలంకరణలు నిర్వహిస్తామన్నారు. ఆలయంలో రోజూ ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. వరలక్ష్మీవ్రతం రోజున అమ్మవారికి 108 చీరలతో అష్టోత్తర శతనామావళితో విశేష అర్చన నిర్వహిస్తామన్నారు.

25 నుంచి శారీరక దారుఢ్య పరీక్షలు

ఏలూరు టౌన్: పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్సై) సివిల్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఏపీఎస్పీ) పోస్టుల నియామకానికి సంబంధించి ఈనెల 25 నుంచి రెండో దశ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19న ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించగా, ప్రస్తుతం ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పీఈటీ)ను రాష్ట్రంలోని నాలుగు కేంద్రాల్లో నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నారు. ఇవి ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏలూరు రేంజ్ పరిధిలో ప్రిలిమినరీ పరీక్షలకు 16,104 మంది హాజరు కాగా వీరిలో 14,007 మంది పురుషులు, 2,097 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. వీరిలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఏలూరు కేంద్రంగా పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహిస్తారని తెలుస్తోంది. అభ్యర్థులు ఈనెల 14వ తేదీ నుంచి తమ కాల్ లెటర్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, ఇతర విద్యార్హతల సర్టిఫికెట్లు, కమ్యూనిటీ, నేటివిటీ సర్టిఫికెట్లు, సర్వీస్‌మెన్ అయితే ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో మూడు సర్పంచ్, 28 వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. డీపీఓ జీవీకే మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం 28 వార్డులకు గాను 9 వార్డులు ఏకగ్రీవం కాగా 19 వార్డులకు 71 మంది పోటీలో నిలిచారు. గొల్లలకోడేరులో ఒక వార్డుకు అత్యధికంగా 10 మంది పోటీలో ఉన్నారు. సర్పంచ్ పదవులకు ఎనిమిది మంది నామినేషన్లు వేశారు.

ప్రగతి చిహ్నాలు.. జగనన్న కాలనీలు

- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- అమృత్ 2.0లో రూ.111.77 కోట్ల నిధులు
- సురక్షిత తాగునీటికి రూ.23.79 కోట్లు
- మురుగునీటి పారుదలకు రూ.87.98 కోట్ల కేటాయింపు
- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని శ్రద్ధతో భారీగా నిధులు



ఏలూరు నియోజకవర్గంలోని కొమడవోలు జగనన్న కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దార్శనికతకు నిలువెత్తు నిదర్శనం జగనన్న కాలనీలు. ఆదర్శకాలనీలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నారు. పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తూనే.. పాత విధానాలకు చెక్‌పెడుతూ సరికొత్త పంథాలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. జగనన్న కాలనీలను అభివృద్ధికి చిహ్నాలుగా తీర్చిదిద్దే సరికొత్త విధానాలను అమలులోకి తీసుకువస్తున్నారు. ఏలూరు నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో 31 వేల మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. తొలిదశలో 16 వేల ఇళ్లను నిర్మించి అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. అలాగే కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అమృత్ 2.0 పథకంలో రూ.111.77 కోట్ల నిధులతో ప్రణాళిక సిద్ధం చేశారు.

జగనన్న ఆధునిక కాలనీలు

ఏలూరు నియోజకవర్గంలో కొమడవోలు, చొదిమెళ్ల, పోణంగి ప్రాంతాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. ఇక్కడ 27 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు చేశారు. మూడు కాలనీల్లో తొలిదశలో సుమారు 16 వేల గృహ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే కాలనీల్లో విద్యుత్ సౌకర్యం పూర్తిస్థాయిలో ఉండేలా సబ్‌స్టేషన్లు సైతం ఏర్పాటు చేశారు.

కాలనీలపై 'అమృత్' ధారలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న అమృత్ 2.0 పథకంలో కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిచ్చారు. కాలనీల్లో తాగునీటి సరఫరాకు రూ.23.79 కోట్ల నిధులు వెచ్చించనున్నారు. కాలనీల్లో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. అలాగే మురుగునీటి పారుదల వ్యవస్థ, ట్రీట్‌మెంట్ ప్లాంట్ వంటి వాటికి భారీగా రూ.87.98 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఆయా పనులకు డీపీఆర్‌లు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే నాని అధికారులను ఆదేశించారు.

వేగంగా నిర్మాణాలు



ఏలూరు నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నాం. ఎమ్మెల్యే ఆళ్ల నాని నాయకత్వంలో ప్రతి పేదవానికి ఇంటి పట్టాలు మంజూరు చేయగా ప్రస్తుతం తొలిదశలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. చొదిమెళ్ల, కొమడవోలు, పోణంగి ప్రాంతాల్లోని జగనన్న కాలనీల్లో రోడ్ల నిర్మాణంతోపాటు విద్యుత్ సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించేలా చర్యలు తీసుకున్నారు.
–షేక్ నూర్జహాన్, ఏలూరు నగర మేయర్

ఆదర్శ కాలనీలుగా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టారు. ఏలూరు నియోజకవర్గంలో 30 వేలకు పైగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కాలనీల్లో ప్రజలకు తాగునీటి సౌకర్యానికి, డ్రెయినేజీ వ్యవస్థకు భారీ ఎత్తున నిధులు మంజూరు కావటం విశేషం. భవిష్యత్‌లో జగనన్న కాలనీలు ఆదర్శ కాలనీలుగా మారతాయనడంలో సందేహం లేదు.
– మధ్యాహ్నపు ఈశ్వరి, ఇడా ఛైర్‌పర్సన్, ఏలూరు

పేదల పక్షపాతి సీఎం జగనన్న



జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అమృత్ 2.0లో నిధులు మంజూరు కావడం సీఎం జగన్ దార్శనికతకు నిదర్శనం. ఏలూరు చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని జగనన్న కాలనీలను అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. తాగునీరు, మురుగునీటి పారుదల, ట్రీట్‌మెంట్ ప్లాంట్, విద్యుత్ సబ్‌స్టేషన్, విద్యుత్ సౌకర్యం, రోడ్లు, డ్రెయిన్లు అన్నీ సమకూరుస్తున్నారు.
– పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్‌పర్సన్

సంస్కృతి నిలయాలు పురావస్తు శాలలు



పురావస్తు ప్రదర్శన శాలను పరిశీలిస్తున్న వాణీమోహన్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలు పురావస్తు ప్రదర్శన శాలలు అని, చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు ఇవి దోహదపడతాయని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జి.వాణిమోహన్ అన్నారు. శుక్రవారం నగరంలోని అగ్రహారంలో ఉన్న పురావస్తు శాఖ జిల్లా మ్యూజియాన్ని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపురూపమైన ప్రాచీన శిల్పాలు, కళాఖండాలు చారిత్రక వారసత్వ సంపదని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలో ప్రాచీన కళారూపాలను, శిల్పాలు, ఇతర కళాఖండాలను మ్యూజియంలో భద్రపరచిన తీరును ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె బుద్ధ పార్కును పరిశీలించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఏలూరు మున్సిపల్ కమిషనర్ ఎస్. వెంకటకృష్ణ, సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్, తహసీల్దార్ సోమశేఖర్ ఆమె వెంట ఉన్నారు.

సున్నావడ్డీతో పొదుపు సంఘాల పురోగతి

4.67 లక్షల మందికి రూ.61.39 కోట్ల విడుదల



కలెక్టరేట్‌లో సున్నా వడ్డీ పథకం చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): పొదుపు సంఘాల ఆర్థిక పురోగతికి సున్నావడ్డీ పథకం దోహదపడుతుందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. శుక్రవారం 2022–23కి నాలుగో విడతగా రాష్ట్రంలో 1,05,13,305 మందికి వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.1,353.76 కోట్లను సీఎం జగన్ అమలాపురం నుంచి బటన్ నొక్కి విడుదల చేశారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి అధికారులు, లబ్ధిదారులతో కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 45,178 పొదుపు సంఘాల్లోని 4,67,062 మంది సభ్యులకు రూ.61.39 కోట్లు నేరుగా బ్యాంకుల ద్వారా అప్పు ఖాతాలకు జమ చేస్తామన్నారు. నియోజకవర్గాల వారీగా చింతలపూడిలో 8,930 సంఘాల్లోని 91,035 మందికి రూ.1,311.54 లక్షలు, దెందులూరులో 6,408 సంఘాల్లోని 66,219 మంది సభ్యులకు రూ.849.58 లక్షలు, ఏలూరులో 4,530 సంఘాల్లోని 46,613 మందికి రూ.702.17 లక్షలు, ద్వారకాతిరుమల మండలంలో 1,799 సంఘాల్లోని 18,544 మందికి రూ.266.62 లక్షలు, కైకలూరులో 5,680 సంఘాల్లోని 59,426 మందికి రూ.722.31 లక్షలు, నూజివీడులో 6,400 సంఘాల్లోని 67,845 మంది మహిళలకు రూ.828.56 లక్షలు, పోలవరంలో 5,766 సంఘాల్లోని 58,776 మందికి రూ.660.70 లక్షలు, ఉంగుటూరులో 5,665 సంఘాల్లోని 58,604 మందికి రూ.797.32 లక్షల లబ్ధి చేకూరుతుందన్నారు. మహిళా సాధికారిత మరింత మెరుగుపడి స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళల ఆర్థిక పురోగతికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు కలెక్టర్ చెక్కు అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, మెప్మా పీడీ ఇమ్మానియేల్, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ నీలాద్రి, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఏలూరు వైద్య కళాశాల సిద్ధం

- 90 శాతం పనులు పూర్తి
- ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరులో వైద్య కళాశాలలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలు, హాస్టల్ నిర్మాణం, మౌలిక వసతులను ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఏలూరు జీజీహెచ్ ఆవరణలోని వైద్య విద్యార్థులకు హాస్టళ్ల ఏర్పాటుపై ఆరా తీశారు. పాత బస్టాండ్ డీఎంహెచ్ఓ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన మెడికల్ కాలేజీ, హాస్టల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో తరగతి గదులు, ల్యాబ్స్, ఆధునిక వసతులతో కూడిన ప్రొఫెసర్ల గదులు, కిచెన్, హాస్టల్ గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, విద్యుదీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలు 90 శాతం పూర్తయ్యాయని, చిన్నపాటి పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. మెడికల్ కళాశాలలో తొలి ఏడాది 150 మంది విద్యార్థులు వైద్య విద్య అభ్యసించేలా భవన నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికా రి కార్యాలయ ఆవరణలో ఆయన మొక్కలు నాటా రు. ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ డి.బలరామిరెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీవీ విజయకుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఆశ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శశిధర్, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, డీఐఓ డాక్టర్ నాగేశ్వరరావు, తహసీల్దార్ సోమశేఖర్ ఉన్నారు.

128 అధ్యాపక పోస్టుల మంజూరు

భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ : 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు



రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీకి కొత్తగా 128 అధ్యాపక పోస్టులు మంజూరయ్యాయని, త్వరలోనే నోటిఫికేషన్ విడుదలవుతుందని వైస్ చాన్సలర్ ఆచార్య పద్మరాజు తెలిపారు. వర్సిటీలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్సిటీలో విద్యా బోధనకు 162 మంది అధ్యాపకులు అవసరం కాగా ప్రస్తుతం 25 మంది మాత్రమే ఉన్నారన్నారు. వర్సిటీలో నూతన విద్యా విధానం అమలు చేస్తూ, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. వర్సిటీలో కాలేజీ డెవలప్‌మెంట్ సెల్, పరీక్షల నిర్వహణలో ఆటోమేషన్ విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కాలేజీల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని, అనుబంధ కళాశాలలను ప్రతి మూడు నెలలకోసారి వర్చువల్‌గా పరిశీలిస్తున్నామన్నారు.

రూ.25.5 కోట్లతో హాస్టల్ భవనాలు : వర్సిటీ క్యాంపస్‌లో ప్రస్తుతం రెండు బాలుర, బాలికల హాస్టళ్లు ఉన్నాయని, వీటికి అదనంగా రూ.25.5 కోట్లతో మరో రెండు హాస్టళ్లు నిర్మిస్తున్నామని ఆచార్య పద్మరాజు తెలిపారు. రూ.16.5 కోట్లతో బాలికలకు, రూ.9 కోట్లతో బాలురకు అదనపు హాస్టళ్ల నిర్మాణం జరుగుతుందని వివరించారు. వీటితో పాటు కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో కూడా అవసమైన భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు.

16, 17 తేదీల్లో సహస్రాబ్ది ఉత్సవాలు

వెయ్యేళ్ల చరిత్ర కలిగిన నగరాల్లో రాజమహేంద్రవరం ఒకటని, ఈ సందర్భంగా ఆదికవి నన్నయ, రాజరాజనరేంద్రుడి పేరిట ఈనెల 16, 17 తేదీల్లో కేంద్ర సాహిత్య అకాడమీ సహకారంతో సహస్రాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నామని ఆచార్య పద్మరాజు తెలిపారు.

రాష్ట్రమంతా 'కాఫీ విత్ క్లాప్‌మిత్ర'

పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బూడిది రాజశేఖర్



భీమడోలులో క్లాప్‌మిత్రలతో కలిసి కాఫీ తాగుతున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ బూడిది రాజశేఖర్

భీమడోలు: ఏలూరు జిల్లాలో భీమడోలులో విజయవంతంగా అమలు చేస్తున్న కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బూడిది రాజశేఖర్ అన్నారు. భీమడోలులోని సాలిడ్ వేస్ట్ రిసోర్స్ కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానాన్ని, సేంద్రియ ఎరువుల తయారీని పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. క్లాప్ మిత్రల సేవలు ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రమంతా అమలు చేస్తామని, ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిని నింపాయని అభినందించారు. భీమడోలులోని షెడ్డును రాష్ట్రంలోనే ఉత్తమ షెడ్డుగా గుర్తిస్తున్నామన్నారు. అనంతరం సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. క్లాప్ మిత్రలు ప్రజలందరి ఆరోగ్యం కాపాడే సైనికులన్నారు. పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. ప్లాస్టిక్‌ను 145 కేటగిరీగా విభజించి వాటిని అమ్మితే పంచాయతీలు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తాయన్నారు. తొలుత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కాఫీ విత్ క్లాప్ కార్యక్రమంలో క్లాప్‌మిత్రలతో కలిసి కాఫీ తాగారు. క్లాప్ మిత్రల సమస్యలను పరిష్కరించాలని, వారి వేతనాలు సకాలంలో అందించాలన్నారు. సీఈవో కె.రవికుమార్, డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌లు జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ శిరీష, నియోజకవర్గ జగన్ సేవాదళ్ కన్వీనర్ తుమ్మగుంట రంగ, గ్రామ కార్యదర్శి ఎస్.ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ, ఆక్వా మందుల మాయాజాలం

- అనధికారికంగా గోదాముల నిర్వహణ
- ఏటా రూ.వందల కోట్ల వ్యాపారం



అనధికార గోదాముల్లో పౌల్ట్రీ మందులను తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

తణుకు: నిన్నమొన్నటి వరకు మనుషులు వినియోగించే మందుల అమ్మకాల్లో వెలుగు చూసిన అక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించాయి. వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే వినియోగించాల్సిన అబార్షన్ కిట్లు, వయాగ్రా, నిద్రమాత్రలు విచ్చలవిడిగా మార్కెట్‌లో దొరుకుతున్న వైనంపై దృష్టి సారించిన ఔషధ నియంత్రణ శాఖ అధికారులు మూలాలను కదిలించారు. తాజాగా పౌల్ట్రీ మందుల అమ్మకాల్లో జరుగుతున్న వ్యవహారంపై దృష్టి సారించిన అధికారులు తణుకులోని శ్రీనివాస పౌల్ట్రీ మెడికల్స్ సంస్థపై దాడి చేసి అవకతవకలు గుర్తించారు. గతంలో ఆక్వాలో విచ్చలవిడిగా వినియోగిస్తున్న యాంటీ బయోటిక్స్‌పై దృష్టి సారించిన అధికారులు తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలికి తీశారు. గత మార్చిలో తణుకులోని ఆక్వా ఫీడ్స్ అండ్ సీడ్స్ దుకాణంలో చేసిన తనిఖీల్లో నిషేధిత యాంటీబయోటిక్స్ మందులు గుర్తించారు. ప్రస్తుతం పౌల్ట్రీ మందులను సైతం అక్రమంగా గోదాముల్లో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అధికారులు మాత్రం తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించి కేవలం రెండు, మూడు గంటల్లోనే తనిఖీలు పూర్తి చేయడం విశేషం.

ఏటా రూ. వందల కోట్ల వ్యాపారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఆక్వా సాగు విస్తరిస్తోంది. ఇటీవల చేపలు, రొయ్యల సాగుపై పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తుండగా ఏడాదికి దాదాపు రూ.100 కోట్ల మేర లావాదేవీలు జరుగుతున్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే ఆక్వా రైతుల ఆశలను సొమ్ములు చేసుకునేందుకు వ్యాపారులు నిషేధిత యాంటీబయోటిక్స్ మందుల్ని ముడి పౌడర్ రూపంలో దిగుమతి చేసుకుని యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో ఫార్మా కంపెనీలకు తరలించాల్సిన మందులను తయారీ కంపెనీల నుంచి పౌడర్ రూపంలో నేరుగా అక్రమంగా దిగుమతి చేసుకుంటున్నారు. మరోవైపు జంతువులు, పశువులు, కోళ్లకు వచ్చే వ్యాధులకు వినియోగించాల్సిన యాంటీబయోటిక్స్, పౌల్ట్రీ మందులను చేపలు, రొయ్యల సాగులో వినియోగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆక్వా సాగు ఎక్కువగా ఉన్న భీమవరం, తణుకు, నరసాపురం, పాలకొల్లు, ఆకివీడు, గణపవరం, అత్తిలి, కానూరు, కైకలూరు, ఏలూరు ప్రాంతాల్లో ఫీడ్స్ అండ్ సీడ్స్ ఏజెన్సీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయితే ఏజెన్సీలతోపాటు రిటైల్ దుకాణాలకు డ్రగ్ లైసెన్సులు తప్పనిసరి అయినా కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. కనీసం ఎలాంటి లైసెన్సులు లేకుండా ఆక్వా, పౌల్ట్రీ మందులను విక్రయిస్తుండగా అక్రమాలపై దృష్టి సారించాల్సిన ఎంపెడా (మెరైన్ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ) అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అతిక్రమిస్తే చర్యలు తప్పవు

కేవలం ఔషధాల విక్రయాలకే కాకుండా ఆక్వా, పౌల్ట్రీ మందులు విక్రయించే ఏజెన్సీలు, దుకాణాలు సైతం కచ్చితంగా నిబంధనలు పాటించాలి. లైసెన్సులు లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు తేలితే చర్యలు తప్పవు. హోల్‌సేల్ లైసెన్సుతో రిటైల్‌గా విక్రయాలు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలతో ఇటీవల తణుకులో తనిఖీలు నిర్వహించాం. పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.
–సీహెచ్ హరిప్రసాద్, ఏడీ, ఔషధ నియంత్రణ శాఖ, ఏలూరు

పక్కాగా ఓటర్ల సవరణ

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి డోర్ టు డోర్ సర్వే వేగవంతంగా చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి ఓటర్ల జాబితా సవరణ, డోర్ టు డోర్ పరిశీలనపై వీఆర్వోలు, తహసీల్దార్లు, బీఎల్‌ఓలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటా పరిశీలనకు తప్పనిసరిగా బీఎల్‌ఓలు, బీఎల్ఎలను వెంట తీసుకుని వెళ్లాలన్నారు. ఫారం 6,7,8పై పూర్తి అవగాహన కల్గి ఉండాలని, ప్రతిదానికి తప్పనిసరిగా డాక్యుమెంట్‌ను దగ్గర పెట్టుకోవాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి పక్కాగా పరిశీలించాలన్నారు. ఒకే డోర్ నంబర్‌లో 10 ఓట్లు ఉంటే మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్ల జాబితాలో నమోదు చేసేటప్పుడు బర్త్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. కేంద్ర ఎన్నికల అధికారులు ఏ సమయంలోనైనా జిల్లాలో ఎక్కడైనా పర్యటించవచ్చని, తప్పులు లేకుండా జాబితాలు తయారు చేయాలన్నారు.